పాలనా వ్యవస్థ... మారుతున్న పరిస్థితులు

భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో సగటు పౌరుడు పాలనా యంత్రాంగంపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. పేదరికం, నిరక్షరాస్యత, న్యూనతాభావం సగటు భారతీయుని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నాయి. తనకు తెలియకుండానే పరాధీన స్వభావాన్ని అలవర్చుకొని, నిస్సహాయ స్థితికి దిగజారి పాలకులైన ప్రజాప్రతి నిధులు, ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడవలసి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలు దాటినప్పటికీ సగటు భారతీయుని జీవనంలో నాణ్యత మెరుగుపడలేదు. దీంతో పౌరునికి పాలనా యంత్రాంగం మీద విశ్వాసం సడలుతోదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండో పాలనా సంస్కరణల సంఘం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని ఇలా పేర్కొంది. 'దేశంలో రోజు రోజుకు అరాచకత్వం పెరిగిపోతోంది. తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి ఆయా వర్గాలు తరచుగా హింసాయుత ధోరణిని అవలంబిస్తున్నాయి. పాలనా యంత్రాంగంలో స్తబ్దత చోటు చేసుకుంది. ప్రజల దృష్టిలో ఉద్యోగిస్వామ్యం అసమర్థతకు, జడత్వానికి, స్పందనారాహిత్యానికి మారు పేరు. అవినీతి అంతటా వ్యాపిస్తోంది. ఇది సామాజిక జవసత్వాలను పీల్చిపిప్పి చేస్తోంది. దేశ ఆర్థిక ప్రగతి కుంటు పడుతూ సమాజంలోని అణగారిన వర్గాలను మరింత కుంగదీస్తోంది. నేరపూరిత రాజకీయాలు వేళ్లూనుకుంటున్నాయి. ధన, కండ బలానికి తిరుగు లేదు. మొత్తం మీద సమాజంలో అసం తృప్తి, నిరాశ, ఆందోళన, అన్ని స్థాయిల్లో అధికార దుర్వినియోగం పెరిగిపోతోంది''.

మరి దీనికి పరిష్కార మార్గమేమిటి?

పాలనా సంస్కరణల సంఘ అధ్యక్షుడు వీరప్ప మొయిలీ అభిప్రాయపడినట్లు:

- ఒకవైపు మితిమీరిన అధికార కేంద్రీకరణతో వ్యవస్థ, దానిలోని ఉద్యోగులు కనీస విచక్షణాధికారం లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు పలుకుబడి ఉన్న కొందరు ఉద్యోగులు విస్తృతంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ప్రజలను భయ భ్రాంతులను చేస్తున్నారు. ఈ రెండు వైపరీత్య ధోరణుల మధ్య సమతౌల్యత అవసరం.
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతి నిధులకు జవాబుదారీతనం వహించాలి. కాని ఆ కారణంతో రాజకీయనాయకులు తమ ఇష్టారాజ్యంగా ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవడం, ఉద్యోగులను సామ, దాన, బేధ, దండోపాయాలతో లొంగదీసుకుంటు న్నారు. ప్రభుత్వోద్యోగులను రాజకీయ ఒత్తిడి నుంచి తప్పించాలంటే, వారి పని షరతులు (నియామకం, బదిలీ, పదోన్నతి విషయాల్లో) రాజకీయ జోక్యానికి అతీతంగా ఉండాలి.



- ఆధునిక పాలనా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా స్పందించాలంటే ఉద్యోగి బృందంలో వృత్తి నైపుణ్యత అవసరం. దీంతో పాటు ఆరోగ్యకర పోటీ వాతావరణం కావాలి. పదవీ కాలం (tenure)లో స్థిరత్వం ఉండాలి. చీటికిమాటికి బదిలీలకు గురయ్యే ఉద్యోగిలో మనోస్థైర్యం దెబ్బ తింటుంది.
- ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువ శాతం యాంత్రికంగా, దర్పంతో, అమూర్తిమత్వ (impersonal) ధోరణిలో వ్యవహరిస్తున్నారు. వీరికి తాము ప్రజా సేవకులమనే విషయం ఎప్పుడూ గుర్తుకు రానట్లుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలన పౌరుని చుట్టూ పరిభ్రమించాలి. పౌరుడు పాలనకు కేంద్ర బిందువు కావాలి. భాగస్వామ్యాన్ని ప్రజలు, పాలకులు ప్రోత్సహించాలి.
- పాలనా యంత్రాంగంలో జవాబుదారీతనం పూర్తిగా లోపిస్తోంది. ఒకవైపు బాధ్యతారాహిత్యం ఉద్యోగుల్లో పెరుగు తుంటే, ఇంకోవైపు అంకితభావం కలిగిన ఉద్యోగులు కొందరు అన్ని రకాల అవమానాలకు గురవుతున్నారు. మన దేశంలో ఉద్యోగులు పనితనాన్ని అంచనా వేయడానికి సరైన ప్రమాణాలు లేవు. ప్రజాధనాన్ని పరిరక్షించడానికి, జవాబు దారీతనాన్ని పెంపొందించడానికి నిర్దిష్ట శిల్ప పద్ధతులను రూపొందించాలి.
- ప్రభుత్వం సేవా దృక్పథంతో వ్యవహరిస్తుందనే కారణంతో, నేటి వరకు అన్ని దేశాల్లో ఖర్చుకు ఇచ్చినంత ప్రాధాన్యతను దాని ఫలితానికి ఇవ్వడం లేదు. పన్ను చెల్లింపుదారుని ప్రతి రూపాయికి సమానమైన ప్రతిఫలం లభించాలి. ఉద్యోగులు విధానాల అమలుతో పాటు, వాటి పరిణామాలకు కూడా బాధ్యత వహించాలి. ప్రభుత్వం అందించే సేవలను పరిమాణాత్మకంగా అంచనా వేయాలి. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకో లేని వారిపై తగిన చర్యలు తీసుకోవాలి. లక్ష్యాలను అధిగమించిన వారిని ప్రోత్సహించాలి.
- పాలనా వ్యవస్థలో నైతిక విలువలను పెంపొందించాలి. సామాజిక విలువలు క్రమేణ దిగజారుతున్న ఈ రోజుల్లో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో అభ్యర్థుల నైతిక విలువలను ఓ ప్రధానాంశంగా పరిగణించాలి. అపుడే అర్హులైన వారిని ఎంపిక చేసి, వారి నుంచి నాణ్యమైన సేవలు పొందొచ్చు.
- పారదర్శకత్వానికి పెద్ద పీట వేయ్యాలి. ఇటీవల కాలం వరకు

ఉద్యోగిస్వామ్యం 'రహస్యం' అనే గొడుగులో తన అరాచ కాలన్నింటిని కప్పిపుచ్చుకుంటూ వచ్చింది. ప్రజల్లో చైతన్యం పెరుగుతున్న కొద్దీ ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఏర్పడింది. స్వీడన్‌లో కొన్ని వందల ఏళ్ల నుంచి ప్రజలకు సమాచార హక్కు అందుబాటులో ఉంది. దేశంలో సమాచార హక్కు చట్టం (2005) పాలనా ప్రవృత్తిలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రవేశపెట్టిందని చెప్పొచ్చు. చట్టాలు చేయడం ఒక ఎత్తు.. వాటిని ప్రజలకు ఉపయోగపడేలా అమలు చేయడం మరో ఎత్తు. ఎక్కువ మంది నిరక్షరాస్యులు, పేదవారు, సామాజిక, రాజకీయ చైతన్యం లోపించిన వారు ఉన్న భారత్‌లో ఈ చట్టం జవాబు దారీతనాన్ని పెంపొందించడంలో ఏ మేరకు విజయవంతమౌ తుందో కాలమే నిర్ణయిస్తుంది. కొన్ని సాంకేతిక లోపాల సాకుతో సుప్రీంకోర్టు, యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ లాంటి వ్యవస్థలు సమాచార హక్కు కింద కోరిన సమాచా రాన్ని తిరస్కరించడం శోచనీయం. ఉద్యోగిస్వామ్యంలో ఈ చట్టం పట్ల ఎంత వ్యతిరేకత ఉందో మనందరికి తెలుసు. పౌర సమాజం ఈ విషయంలో క్రియాశీలంగా వ్యవహరించినప్పుడే ఈ చట్ట లక్ష్యం సార్థకమవుతుంది. ఉద్యోగుల్లో అల సత్వం, పక్షపాత ధోరణి, అవినీతిని అంత మొందించడానికి ఇది ఒక విరుగుడు (antidote)గా పని చేస్తుంది.

- 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా స్థానిక ప్రభుత్వాలకు జవసత్వాలు కలిగాయని, సమాఖ్య వ్యవస్థలో మూడో అంచెను (త్రీటైర్ ఫెడరేషన్) ప్రారంభించామని మీడియా, రాజకీయ నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. పంచాయితీ రాజ్ వ్యవస్థలకు 29 అంశాలను, పట్టణ స్థానిక సంస్థలకు 18 అంశాలను బదిలీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి గర్హనీయం. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళ, పశ్చిమ బెంగాల్ మినహాయించి, ఎక్కడా కూడా ఈ విషయంలో రాష్ట్ర రాజకీయ నాయకత్వంలో చిత్తశుద్ధి కనబడటం లేదు. అధికార వికేంద్రీకరణ జరిగి, ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే పాలన ప్రభావ వంతంగా ఉంటుంది. మాటల కంటే చేతలు ముఖ్యం.
- దేశంలో పోలీసు యంత్రాంగం పని తీరు రోజురోజుకు వివా దాస్పదమౌతోంది. సగటు భారతీయునికి ఈ వ్యవస్థ మీద నమ్మకం లేదు. ఎందరో యువతీ యువకులు ఉగ్రవాదం వైపు ఆకర్షితులవడానికి బలమైన కారణం పోలీసు వ్యవస్థ పక్షపాత ధోరణి, అహంకార వైఖరి, అవినీతే. అన్యాయానికి గురైన వ్యక్తికి ఆపన్న హస్తం అందించాల్సిన పోలీసు వ్యవస్థ ఆ వ్యక్తిని ఇంకోసారి అన్యాయానికి గురి చేస్తోంది. కంచే చేను మేసిన చందాన మన పోలీసు వ్యవస్థ పనితీరు ఉంది. ఇందుకు కేవలం పోలీసు సిబ్బందిని తప్పు పట్టకూడదు. వారి నియామకం, బదిలీ, పదోన్నతుల విషయంలో జోక్యం చేసుకుని, తమ విధులు సక్రమంగా నిర్వహించకుండా అడు గడుగునా అడ్డుపడే రాజకీయ నాయకులే ఈ దుస్థితికి కారకులు. జాతీయ పోలీస్ కమిషన్ ఎనిమిదో దశకంలో చేసిన సిఫార్సులు, సుప్రీంకోర్టు 2006లో జారీ చేసిన మార్గద ర్శక సూత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ''అధికారయుత పోలీసు వ్యవస్థ స్థానంలో ప్రజా పోలీసు వ్యవస్థను'' రూపొందించడం వీలవుతుంది. దేశంలో పెరిగిపోతున్న హింసాయుత ధోరణులకు చాలా వరకు పోలీసు యంత్రాంగంలోని అలసత్వమే కారణం.
- ఉదారవాదం, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభు త్వోద్యోగులను కాంట్రాక్టు పద్ధతిన పరిమిత కాలానికి నియమించడం అవసరం. మితిమీరిన ఉద్యోగ భద్రత వినియోగదారునిగా పౌరునికి లాభసాటి కాదు. ఈ విధానం వల్ల ప్రభుత్వ పరంగా వ్యయం తగ్గుతుంది. ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

ARCs... At a Glance

- దేశంలో మొదటి పాలనా సంస్కరణల కమిషన్‌ను 1966లో ఏర్పాటు చేశారు. దీనికి మొరార్జీ దేశాయ్ నేతృత్వం వహించారు.
- 1966-70 మధ్య ఈ కమిషన్ మొత్తం 20 నివేదికలు, 581 సిఫార్సులు చేసింది.
- రెండో పాలనా సంస్కరణల కమిషన్‌ను 2005, ఆగస్టు 31న వీరప్ప మొయిలీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు.
- కమిషన్‌కు ఛైర్మన్, నలుగురు సభ్యులు, ఒక మెంబర్ సెక్రటరీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కమిషన్ తొలి నివేదిక 2006, జూన్ 9న సమర్పించింది.
- తాజాగా.. ఫిబ్రవరిలో 12వ నివేదికను రూపొందించింది. సంస్కరణలు ప్రతిపాదించే క్రమంలో సొంత విధానాలు రూపొందించుకునే అధికారం, కమిటీలను నియమించుకునే స్వేచ్ఛ కమిషన్‌కు ప్రభుత్వం ఇచ్చింది.
- కమిషన్ కోరిన సమాచారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని మంత్రిత్వ శాఖలు, వివిధ విభాగాలు తప్పనిసరిగా అందజేయాలి.
- కమిషన్ తాను రూపొందించే నివేదికలను కేంద్ర ప్రభు త్వానికి, మినిస్ట్రీ ఆఫ్ పర్సనల్, పబ్లిక్ గ్రీవియెన్సెస్, పెన్షన్స్ విభాగాలకు అందజేస్తుంది.
- పరిపాలనా వ్యవస్థలో నైతిక విలువలు పెంపొందించడం.. ఆర్థిక నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం, రాష్ట్ర, జిల్లా, పంచాయితీ స్థాయిల్లో సుపరిపాలన అందిం చడం, విపత్తు నిర్వహణ, ఈ-గవర్నెన్స్ దిశగా నడింపిం చడం వంటి లక్ష్యాలుగా కమిషన్ పని చేస్తుంది.